
# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 97 | బుధవారం 10, డిసెంబర్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com


## వందేమాతరం గేయం కాదు..
# భారత ఆత్మ



ఈ గీతం ఎంతోమందిలో స్ఫూర్తి నింపింది

150 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్మరించుకోవాలి

యుగాలు గడిచినా దేశభక్తిని నింపుతూనే ఉంది

పార్లమెంటులో కేంద్రహోంమంత్రి అమిత్ షా

**న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):**

నేషనల్ సాంగ్ 'వందేమాతరం' రచనకు 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా భారత పార్లమెంటులో ప్రత్యేక చర్చ జరిగింది. బంకిం చంద్ర చటర్జీ రచించిన ఈ అమర గీతం 1875లో మొదటిసారిగా ప్రచురితమైన 'ఆనందమఠ్' నవలలో భాగంగా వెలువడింది. స్వాతంత్ర్య సమరయోధులకు అపారమైన ప్రేరణనిచ్చిన ఈ గేయం ఇప్పటికీ దేశభక్తిని రగిలిస్తూనే ఉంది. లోక్‌సభలో సోమవారం (డిసెంబర్ 8, 2025) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ చర్చను ప్రారంభించగా, మంగళవారం (డిసెంబర్ 9, 2025) రాజ్యసభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా దానిని కొనసాగించారు. రాజ్యసభలో అమిత్ షా మాట్లాడుతూ "వందేమాతరం కేవలం ఒక పాట కాదు, అది భారతీయత యొక్క ప్రాణవాయువు. కాలం గడిచినా, యుగాలు మారినా ఈ గేయం ప్రతి భారతీయుడి ..మిగతా 2లో




# 74 పరుగులకే కుప్పకూలిన దక్షిణాఫ్రికా...

176 పరుగుల ఛేజింగ్ లో చేతులెత్తేసిన సఫారీలు

12.3 ఓవర్లలోనే ఆలౌట్ | టీమిండియా ఆల్ రౌండ్ షో

**కటక్, (ప్రజాస్వరం):**

దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో టీమిండియా 101 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. భారత బౌలర్ల సమష్టి ప్రదర్శన ముందు సఫారీ బ్యాటింగ్ లైనప్ పేకమేడలా కూలిపోయింది. 176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా జట్టు, కేవలం 12.3 ఓవర్లలో 74 పరుగులకే ఆలౌట్ ..మిగతా 2లో




# దశాబ్దాల ఆకాంక్ష నెరవేర్చింది కాంగ్రెస్సే

సోనియా గాంధీ చలువతోనే తెలంగాణ సాకారం

రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలు ఆవిష్కరించుకుంటున్నాం

సోనియా, మన్మోహన్ స్ఫూర్తితోనే పథకాలు అమలు చేస్తున్నాం

గ్లోబల్ సమ్మిట్ విజయవంతంగా సాగుతోంది

లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ ప్రజల ఆరు దశాబ్దాల ఆకాంక్షను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లా కలెక్టరేట్లలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాలను ఫ్యూచర్ సిటీలోని గ్లోబల్ సమిట్ ప్రాంగణం నుంచి సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమం 2024 డిసెంబర్ 9న జరిగింది, ఇది తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైన రోజు మరియు కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ జన్మదినం కూడా. ప్రభుత్వం రూ.5.8 కోట్ల వ్యయంతో ఈ విగ్రహాలను నిర్మించింది. ప్రతి విగ్రహం 18 అడుగుల ఎత్తుతో రూపొందించబడింది, మరియు కొత్త డిజైన్‌లో 'అభయ హస్తం' (అభయమిచ్చే చేయి) ఉంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర్ రాజనరసింహా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు, సీఎం రేవంత్ రెడ్డి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ..మిగతా 2లో

## ముగిసిన తొలి విడత పంచాయతీ
# ఎన్నికల ప్రచారం

తొలి విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం ముగింపు

రేపుఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్

56 లక్షల మందికి పైగా ఓటర్లతో ఎన్నికల సమరం

తొలి విడతలోనే 395 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం




## ఆర్థిక రంగానికి బూస్టర్ డోస్
# పర్యాటకమే

2047 నాటికి జీఎస్డీపీలో 10% వాటా

భారీగా ఉపాధి కల్పించడమే లక్ష్యం

అత్యాధునిక మౌలిక వసతులు, భవిష్యత్ వ్యూహాలు

వారసత్వ సంపదపై అవగాహన పెరగాలి

తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు పర్యాటక రంగం కీలకం

మంత్రి జూపల్లి కృష్ణారావు

గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ పర్యాటక దృష్టికోణాన్ని వెల్లడి



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు పర్యాటక రంగం కీలకం కానుందని, 2047 నాటికి రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (GSDP)లో పర్యాటక రంగం వాటాను 10%కి పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ 2047 - గ్లోబల్ సమ్మిట్ లో భాగంగా "తెలంగాణ ..మిగతా 3లో


## దీర్ఘకాలిక లక్ష్యాలతో తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్

ఎంత డిజిటల్ అయినా.. ఎంత ఏఐ వచ్చినా.. హ్యూమన్ టచ్‌కు ఉన్న ప్రాధాన్యత వేరు

ఆ స్కిల్‌ను భర్తీ చేయడం ఎవరితరం కాదు.

విజన్ డాక్యుమెంట్ చూసాక.. టార్గెట్ పెద్దగా ఉండాలని నిర్ణయించుకున్నా

నాలుగు దశాబ్దాల వ్యాపారవేత్తగా ఉన్న నాకు.. రేవంత్ ఓ సమ ఉజ్జీలా కనిపించారు : మహీంద్రా






## కేసీఆర్ అంటే పోరాటం.. రేవంత్ అంటే వెన్నుపోటు

కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ప్రజలు ఎదురుచూస్తున్నారన్న హరీశ్

కేసీఆర్ దీక్ష వల్లే తెలంగాణ సాధ్యమైందని వ్యాఖ్య

తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ కోసం మరో పోరాటానికి పిలుపు

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ కోసం ప్రజలు మరో పోరాటానికి సిద్ధం కావాల్సిన సమయం వచ్చిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన 'విజయ దీక్షా దివస్' ..మిగతా 2లో

## ప్రతి కుటుంబానికి సొంతిల్లు అందించడమే లక్ష్యం

విజన్ 2047కు అనుగుణంగా సమగ్ర విధానం రూపకల్పన

గతంలో ఇందిరమ్మ పథకం ద్వారా 42 లక్షల ఇండ్లు నిర్మించాం

ఇప్పుడు మరో 3.5 లక్షల ఇండ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి

ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్డు మధ్యలో అఫర్డ్ బుల్ హౌసింగ్

మూడు ప్రధాన ప్రాంతాలుగా విభజన - మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఉన్నతమైన ప్రమాణాలతో నివసించేందుకు అనువైన సొంత ఇంటి వసతిని కల్పించాలన్నది ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర రెవెన్యూ, ..మిగతా 3లో




## రెవెన్యూ సేవలు మరింత
# సులభతరం

రియల్‌టైమ్‌లో పట్టాదారు పాస్ పుస్తకాల ఆటో మ్యుటేషన్

2027 డిసెంబర్ నాటికి భూముల రీసర్వే పూర్తి కావాలి

రెవెన్యూ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం



# 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

83 పేజీలతో విజన్ డాక్యుమెంట్ రూపకల్పన

తెలంగాణ మీన్స్ బిజినెస్ పేరుతో డాక్యుమెంట్

10 కీలక వ్యూహాలతో విజన్ డాక్యుమెంట్ రూపకల్పన

క్యూర్, ప్యూర్, రేర్ జోన్లుగా తెలంగాణ

2047 నాటికి 3 ట్రిలియన్ల డాలర్ల ఎకానమీ టార్గెట్

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'తెలంగాణ విజన్ 2047' డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025' ముగింపు సందర్భంగా 83 పేజీలతో కూడిన ఈ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. తెలుగుతో పాటు ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఈ డాక్యుమెంట్‌ను రూపొందించారు. 'తెలంగాణ మీన్స్ బిజినెస్' పేరుతో ఈ డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. 10 కీలక ప్రణాళికలతో ఈ డాక్యుమెంట్‌ను సిద్ధం చేశారు. సదస్సు ముగింపు సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విజన్ డాక్యుమెంట్ కోసం ..మిగతా 2లో

## ముగిసిన తొలి విడత
# పంచాయతీ ఎన్నికల ప్రచారం

- **తొలి విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం ముగింపు**
- **రేపు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్**
- **56 లక్షల మందికి పైగా ఓటర్లతో ఎన్నికల సమరం**
- **తొలి విడతలోనే 395 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

రాష్ట్రంలో గ్రామ పాలనకు సంబంధించి నిర్వహిస్తున్న పంచాయతీ ఎన్నికల తొలి విడత ప్రచారం సోమవారంతో ముగిసింది. ఎన్నికల ప్రచారం ముగియడంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం నెలకొంది. తొలి విడత పోలింగ్ ఎల్లుండి ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరగనుంది. ఈ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.
మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 189 మండలాల్లోని 4,235 గ్రామ పంచాయతీలకు పోలింగ్ జరగనుంది. ఈ విడతలో మొత్తం 56 లక్షల 19వేల 430 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 27 లక్షల 41 వేల 70 మంది పురుష ఓటర్లు ఉండగా, 28 లక్షల 78 వేల 159 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అదేవిధంగా 201 మంది ఇతర (థర్డ్ జెండర్) ఓటర్లు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు.
ఎన్నికల నిర్వహణ కోసం 37,562 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓటర్లు సులభంగా ఓటు వేయడానికి అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన అదే రోజు మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు చేపట్టి, అనంతరం ఫలితాలను ప్రకటించనున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కఠిన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈరోజు సాయంత్రం 6 గంటల నుంచి ఎల్లుండి సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు, బెల్ట్ షాపులను మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు.
ఇదిలా ఉండగా, తొలి విడతలోనే 395 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు వెల్లడించారు. ఎక్కడా పోటీ లేకుండా గ్రామ పాలక మండళ్లు ఎంపిక కావడంతో ఆయా గ్రామాల్లో ఎన్నికల నిర్వహణ అవసరం లేకుండా పోయింది. మిగిలిన గ్రామ పంచాయతీలలో పోలింగ్ జరగనుండగా, ప్రజల తీర్పుతో గ్రామ పాలనలో కొత్త అధ్యాయానికి నాంది పడనుంది.




# కేసీఆర్ అంటే పోరాటం.. రేవంత్ అంటే వెన్నుపోటు

**మొదటిపేజీ తరువాయి**

కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కేసీఆర్ దీక్ష ఫలితంగానే డిసెంబర్ 9 ప్రకటన వచ్చిందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ అన్నారు. కేసీఆర్ దీక్షనే లేకపోతే డిసెంబర్ 9 అర్ధరాత్రి చిదంబరం ప్రకటన వచ్చేదా అని ప్రశ్నించారు. దీక్ష చేయకపోతే ఢిల్లీ దిగి వచ్చేదా అని నిలదీశారు. కేసీఆర్ దీక్ష, అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ (Telangana) రాష్ట్రం అన్నారు. కేసీఆర్ అంటే పోరాటం.. కేసీఆర్ అంటే త్యాగం అని, రేవంత్ అంటే వెన్నుపోటు.. రేవంత్ అంటే ద్రోహం అని ధ్వజమెత్తారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర అంటూ రాస్తే రేవంత్‌కు ఉన్న స్థానం ద్రోహం, వెన్నుపోటు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ద్రోహి అని చెప్పారు. తెలంగాణ భవన్‌లో విజయ్ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్ రావు.. తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. 'డిసెంబర్ 9 అనేది చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు. నవంబర్ 29న దీక్షా దివస్ జరుపుకున్నాం. నవంబర్ 29 లేకపోతే డిసెంబర్ 9 తెలంగాణ ప్రకటన లేదు. డిసెంబర్ 9 లేకపోతే జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం లేదు. తెలంగాణ ఉద్యమంలో ఈ 3 రోజులు చాలా కీలకమైనవి.
నిమ్స్‌లో కేసీఆర్ 11 రోజులు ఆమరణ దీక్ష దేశారు. కేసీఆర్ దీక్ష ఫలితం డిసెంబర్ 9న ప్రకటన వచ్చింది. కేసీఆర్ దీక్షనే లేకపోతే డిసెంబర్ 9 అర్ధరాత్రి చిదంబరం ప్రకటన వచ్చేదా?. దీక్ష చేయకపోతే ఢిల్లీ దిగి వచ్చేదా?. కేసీఆర్ దీక్ష, అమరుల త్యాగ ఫలితం తెలంగాణ రాష్ట్రం. దీక్ష లేకపోతే తెలంగాణ ప్రకటనే రాదు. ప్రకటన వచ్చిందంటే కేసీఆర్ పోరాటం, దీక్ష ఫలితం. కేసీఆర్ అంటే పోరాటం.. కేసీఆర్ అంటే త్యాగం. రేవంత్ అంటే వెన్నుపోటు.. రేవంత్ అంటే ద్రోహం. రాజీనామాలు చేయాలంటే జీరాక్స్‌లు ఇచ్చిన వ్యక్తి రేవంత్ రెడ్డి. జై తెలంగాణ అంటే తుపాకీతో కాలుస్తా అని



రైఫిల్ పట్టుకున్న వ్యక్తి రేవంత్. తెలంగాణ ఉద్యమ చరిత్ర అంటూ రాస్తే రేవంత్‌కు ఉన్న స్థానం ద్రోహం, వెన్నుపోటు.
ఈ రోజు తెలంగాణ తల్లిని మారుస్తున్నారు. రేవంత్ సృష్టించిన తల్లిని పెడుతున్నారు. తెలంగాణ ఉద్యమం, భావోద్వేగాల మధ్య పుట్టిన తల్లి తెలంగాణ తల్లి. తెలంగాణ తల్లిని ఊరూరా ప్రజలే పెట్టుకున్నారు. తెలంగాన ఉద్యమంలో పుట్టిన తల్లిని మార్చే హక్కు రేవంత్‌కు లేదు. రేవంత్ తెలంగాణ ప్రజల తలరాతలు మారుస్తా అన్నాడు. ప్రజల తలరాతలు మార్చలేదు కానీ, తెలంగాణ తల్లిని మాత్రం మార్చాడు. ఎరువులు, విత్తనాల కొరత సృష్టించాడు. ధరలు పెంచాడు. రైతుబంధు ఎగ్గొట్టాడు. రైతుబీమాకు డబ్బులు కట్టలేదు. మహిళలను ఆగం చేశాడు. రాష్ట్రాన్ని ఆగం చేశాడు. తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నాడు.
రవీంద్రభారతి అవార్డుల కంటే రామోజీ ఫిలింసిటీ అవార్డు గొప్పదని అంటున్నాడు. రవీంద్రభారతిలో దాశరథి, కాళోజీ, గద్దరన్న అవార్డులు ఇస్తారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ద్రోహి. హైదరాబాద్‌కు ట్రంప్ రోడ్డు అని పేరు పెడుతాడంటా. తెలుగు పిల్లలను జైళ్లలో వేసినందు ట్రంప్ పేరు పెడతావా?. మన దేశాన్ని ఇబ్బంది పెట్టి వ్యాపార సంస్థలు మూతపడి, పిల్లల ఉద్యోగాలు ఊడగొట్టినందుకు ట్రంప్ పేరు పెడుతావా?. హైదరాబాద్ పిల్లలు ఉద్యోగాలు రాక అమెరికాలో నానా ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు ట్రంప్ ఫీజులు పెంచారు. రేవంత్ రెడ్డి నాడు సోనియా గాంధీని బలి దేవత అన్నాడు. 500 మంది పిల్లల చావుకు కారణం సోనియా అన్నాడు. అప్పుడు బలిదేవత.. ఇప్పుడు దేవత అంటున్నాడు. సోనియమ్మ ఇచ్చిన తెలంగాణను వెనక్కి తీసుకున్నందుకు డిసెంబర్ 23న తెలంగాణ విద్రోహ దినం జరుపుకోవాలి' అని హరీశ్ రావు విమర్శించారు.

# దశాబ్దాల ఆకాంక్ష నెరవేర్చింది కాంగ్రెస్సే

**మొదటిపేజీ తరువాయి**

తెలంగాణ స్టేట్ సెక్రటేరియట్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "తెలంగాణ తల్లి విగ్రహాల ఆవిష్కరణ జరగడం ఆనందంగా ఉంది. 2009లో ఇదే రోజు తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. ఆరు దశాబ్దాల ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చింది. ఏటా డిసెంబరు 9న తెలంగాణ తల్లి ఆవిష్కరణ ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. తెలంగాణ తల్లిని తలుచుకుని పనులు మొదలు పెట్టేందుకే విగ్రహాలు ఆవిష్కరించాం" అని అన్నారు. "స్వరాష్ట్ర కల నిజమై.. సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం నంబర్ వన్‌గా రూపొందుతోంది. సోనియా గాంధీ ఎన్నో అడ్డంకులు అధిగమించి మరీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారు. ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన గొప్ప నాయకురాలు సోనియాగాంధీ జన్మదినం డిసెంబరు 9న కావడం మా అందరికీ సంతోషాన్ని కలిగించే పర్వదినం. ఏటా తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవాలతో పాటు, సోనియా గాంధీ జన్మదిన ఉత్సవాలను తెలంగాణ ప్రజలు నిర్వహించుకుంటారు. మా పథకాలు, కార్యక్రమాల్లో సోనియా, మన్మోహన్ స్ఫూర్తి కొనసాగుతోంది" అని వ్యాఖ్యానించారు. తెలంగాణ తల్లి నాలుగు కోట్ల ప్రజల భావన అని సీఎం పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 9ను ప్రతి సంవత్సరం 'తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం'గా జరుపుకోవాలని నిర్ణయించింది. ఈ విగ్రహాలు రాష్ట్ర సెక్రటేరియట్‌లో మాత్రమే కాకుండా, అన్ని జిల్లా కలెక్టరేట్లలో ఏర్పాటు చేయడం ద్వారా తెలంగాణ సంస్కృతి, గుర్తింపును మరింత బలోపేతం చేస్తుంది. ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత మొదటిసారిగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా ఆవిష్కరించడం గమనార్హం. మునుపటి బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా తెలంగాణ తల్లి




విగ్రహాన్ని రూపొందించాలని ప్రయత్నించింది, కానీ అది పూర్తి కాలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పనిని వేగవంతం చేసి, సోనియా గాంధీ జన్మదినానికి సమకాలీకరించి ఆవిష్కరించింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ప్రతి జిల్లాలో స్థానిక నాయకులు, అధికారులు విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలు జరిగాయి. తెలంగాణ తల్లి విగ్రహం రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తుంది మరియు ప్రజలకు ప్రేరణగా నిలుస్తుంది అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

ఆన్‌లైన్ ద్వారా సూచనలు, సలహాలు వచ్చాయని అన్నారు. ఆర్థిక నిపుణుల సూచనలు తీసుకున్నట్లు చెప్పారు. తెలంగాణ విజన్ డాక్యుమెంటుకు 4 లక్షల మంది ప్రజలు ఆన్‌లైన్‌లో సూచనలు, సలహాలు ఇచ్చారని వెల్లడించారు.
నిపుణులు ఎంతోమంది ఈ విజన్ డాక్యుమెంట్‌లో భాగస్వాములు అయ్యారని తెలిపారు. 2047 నాటికి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తవుతుందని, అప్పటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 83 పేజీలతో విజన్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేసినట్లు చెప్పారు.
తాను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో కలిసి పెరిగానని, వారి సమస్యలు తనకు తెలుసని అన్నారు. పేదరికం నిర్మూలన, పేద ప్రజల



అభివృద్ధి తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. చైనా, జపాన్, కొరియా దేశాలను రోల్ మోడల్‌గా తీసుకున్నట్లు తెలిపారు. పేదలు, రైతులు, వ్యాపారులు, యువతకు అభివృద్ధి ఫలాలు దక్కేలా విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించామని అన్నారు.




## 74 పరుగులకే కుప్పకూలిన దక్షిణాఫ్రికా...
# 101 పరుగుల తేడాతో టీమిండియా విన్


**మొదటిపేజీ తరువాయి**

అయింది. ఈ విజయంతో 5 మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 10 ఆధిక్యంలో నిలిచింది.
లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికాకు ఆరంభం నుంచే కష్టాలు మొదలయ్యాయి. ఇన్నింగ్స్ రెండో బంతికే ఓపెనర్ క్వింటన్ డికాక్ (0) డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత ట్రిస్టన్ స్టబ్స్ (14), కెప్టెన్ ఐడెన్ మార్‌క్రమ్ (14) కాసేపు నిలబడినా, స్వల్ప వ్యవధిలోనే ఔటయ్యారు. కీలక బ్యాటర్లు డేవిడ్ మిల్లర్ (1), డొనోవాన్ ఫెరీరా (5) పూర్తిగా విఫలమయ్యారు. ఒక దశలో డివాల్డ్ బ్రెవిస్ (22) కాస్త దూకుడుగా ఆడినా, అతనికి మరో ఎండ్ నుంచి సహకారం లభించలేదు. సఫారీ ఇన్నింగ్స్‌లో అతడే టాప్ స్కోరర్‌గా నిలవడం వారి బ్యాటింగ్ వైఫల్యాన్ని తెలియజేస్తోంది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ తలో రెండు వికెట్లు పడగొట్టి సఫారీ పతనాన్ని శాసించారు.
అంతకుముందు, టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. ఒక దశలో 104 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును హార్దిక్ పాండ్యా ఆదుకున్నాడు. కేవలం 28 బంతుల్లో 4 సిక్సర్లు, 6 ఫోర్లతో అజేయంగా 59 పరుగులు చేసి జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించాడు. అతనికి తిలక్ వర్మ (26), అక్షర్ పటేల్ (23) నుంచి సహకారం లభించింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో లుంగి ఎంగిడి మూడు వికెట్లు తీశాడు.

## కుటుంబ సమస్యలతో
# రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య


**కుషాయిగూడ,డిసెంబర్ 9(ప్రజాస్వరం):**

కాప్రా మున్సిపల్ పరిధిలోని సైనిక్‌పురిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. స్థానికంగా నివసిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి శ్రవణ్ కుమార్ (35) కుటుంబ సమస్యలతో సోమవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి సమయంలో భోజనానికి రాకపోవడంతో అనుమానించిన అతని సోదరుడు తలుపు పగులగొట్టి లోపలికి వెళ్లి చూసే సరికి శ్రవణ్ కుమార్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే అతన్ని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న కుషాయి



గూడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## దీర్ఘకాలిక లక్ష్యాలతో తెలంగాణ
# రైజింగ్ విజన్ డాక్యుమెంట్



- **ఎంత డిజిటల్ అయినా.. ఎంత ఏఐ వచ్చినా.. హ్యూమన్ టచ్‌కు ఉన్న ప్రాధాన్యత వేరు**
- **ఆ స్కిల్‌ను భర్తీ చేయడం ఎవరితరం కాదు.**
- **విజన్ డాక్యుమెంట్ చూసాక.. టార్గెట్ పెద్దగా ఉండాలని నిర్ణయించుకున్నా**
- **నాలుగు దశాబ్దాల వ్యాపారవేత్తగా ఉన్న నాకు.. రేవంత్ ఓ సమ ఉజ్జీలా కనిపించారు : మహీంద్రా**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

భారత్ ఫ్యూచర్ సిటీలో అత్యంత వైభవంగా నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' విజయవంతంగా ముగిసింది. ఈ అంతర్జాతీయ స్థాయి సమ్మిట్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్త, మహీంద్రా అండ్ మహీంద్రా చైర్‌పర్సన్ ఆనంద్ మహీంద్రా పాల్గొని సీఎం రేవంత్ రెడ్డిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన అభివృద్ధి దిశ, విజన్ డాక్యుమెంట్ ఆయనను బాగా ఆకట్టుకుందని వెల్లడించారు.
సమ్మిట్ వేదికపై మాట్లాడిన ఆనంద్ మహీంద్రా... టెక్నాలజీ ఎంత వేగంగా ఎదిగినా, డిజిటలైజేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంత విస్తరించినా హ్యూమన్ టచ్‌కు ఉన్న ప్రాధాన్యత ఎప్పటికీ తగ్గదన్నారు. మానవీయ నైపుణ్యాన్ని ఏ సాంకేతికత భర్తీ చేయలేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా హ్యూమన్ స్కిల్స్‌కు కీలక పాత్ర ఉంటుందని వ్యాఖ్యానించారు.
తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన విజన్ డాక్యుమెంట్‌ను పరిశీలించిన తర్వాత లక్ష్యాలను మరింత విస్తృతంగా, పెద్ద స్థాయిలో పెట్టుకోవాలని అనిపించిందని ఆనంద్ మహీంద్రా తెలిపారు. ఆ డాక్యుమెంట్‌ను చూస్తే నిపుణుల అభిప్రాయాలు మాత్రమే కాకుండా, తెలంగాణ ప్రజల ఆశయాలు కూడా ప్రతిబింబించినట్లు అనిపించిందన్నారు. యువత, మహిళలు, సమగ్ర అభివృద్ధి వంటి అంశాలు సమతుల్యంగా ఇందులో పొందుపరిచినట్లు ప్రశంసించారు. ఇంత స్ఫూర్తిదాయకమైన విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆనంద్ మహీంద్రా ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం స్పష్టమైన దిశ, ధైర్యమైన లక్ష్యాలతో ముందుకు వెళ్తున్న నాయకత్వం తెలంగాణలో కనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. జహీరాబాద్‌లో మహిళలు నిర్వహిస్తున్న బ్యాటరీ తయారీ పరిశ్రమ తమకు గర్వకారణమని ఆనంద్ మహీంద్రా చెప్పారు.
మహిళా సాధికారత, పారిశ్రామిక అభివృద్ధి రెండూ కలిసొచ్చేలా తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. నాలుగు దశాబ్దాలుగా వ్యాపార రంగంలో ఉన్న తన అనుభవంతో చూస్తే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు ఒక సమఉజ్జీలా కనిపిస్తున్నారని ఆనంద్ మహీంద్రా వ్యాఖ్యానించారు. భవిష్యత్తు తెలంగాణ నిర్మాణంలో ఈ తరహా నాయకత్వం కీలకంగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# వందేమాతరం గేయం కాదు.. భారత ఆత్మ

**మొదటిపేజీ తరువాయి**

రక్తంలో దేశభక్తిని నింపుతూనే ఉంటుంది. స్వాతంత్ర్య సమరంలో బ్రిటిష్ పాలకులు ఈ పాటను నిషేధించారు, ఎందుకంటే ఇది వారి పాలనకు భయానకమైన ఆయుధంగా మారింది. రవీంద్రనాథ్ ఠాగూర్ నుంచి సుభాష్ చంద్ర బోస్ వరకు, మహాత్మా గాంధీ నుంచి భగత్ సింగ్ వరకు - అందరినీ ఈ గేయం ఒక్కటే కదలించింది" అని గుర్తుచేసుకున్నారు.

**ఆయన మరింత ఉద్వేగంతో కొనసాగించారు:**
"1875లో బంకిం చంద్రుడు రాసిన ఈ స్తోత్రం భారతమాతను దేవతగా కొలుస్తూ, ఆమె కోసం ప్రాణాలర్పించడానికి సిద్ధపడమని పిలుపునిచ్చింది. ఆ రోజు బ్రిటిష్ వలస పాలనలో బానిసలుగా ఉన్న మన పూర్వీకులకు ఇది ఆత్మవిశ్వాసం నింపింది. నేడు స్వతంత్ర భారతంలో మనం ఆర్థికంగా, సైనికంగా బలోపేతమవుతున్న ఈ క్షణంలో కూడా 'వందేమాతరం' మనలో ఐక్యతను, గర్వాన్ని, కర్తవ్యబోధను జాగృతం చేస్తూనే ఉంది." ప్రధాని మోదీ లోక్‌సభలో మాట్లాడుతూ ఈ గేయం భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికత,



దేశభక్తి యొక్క సమ్మేళనమని, దీనిని ఎప్పటికీ మరచిపోకూడదని దేశ ప్రజలకు గుర్తుచేశారు. ఈ చర్చలో అన్ని పార్టీల నాయకులు పాల్గొని, వందేమాతరం యొక్క చారిత్రక ప్రాధాన్యతను, దాని సార్వకాలిక విలువలను కొనియాడారు. రాజ్యసభలో చర్చ ముగిసిన తరువాత సభ్యులంతా ఏకకంఠంతో 'వందేమాతరం' ఆలపించడం హృదయస్పర్శిగా నిలిచింది. ఇది కేవలం ఒక వార్షికోత్సవం మాత్రమే కాదు - భారతమాత గౌరవార్థం, దేశభక్తి పునరుజ్జీవనార్థం జరుగుతున్న మహోత్సవం! వందేమాతరం!

### ఆర్థిక రంగానికి 'బూస్టర్ డోస్'

# పర్యాటకమే

మొదటిపేజీ తరువాయి

అనుభవాలు - వారసత్వం, సంస్కృతి ఫ్యూచర్ రెడీ టూరిజం" అనే అంశంపై నిర్వహించిన చర్చా కార్యక్రమంలో అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు కీలకోపన్యాసం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గనిర్దేశంలో జరిగిన ఈ సమ్మిట్‌ను ప్రశంసిస్తూ, 2047 నాటికి $3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని కేవలం సంఖ్యాత్మక సూచికగానే కాకుండా, రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి మార్గంగా మంత్రి జూపల్లి అభివర్ణించారు. తెలంగాణ సాధన కోసం జరిగిన త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు బలమైన ఆర్థికాభివృద్ధిని సాధించాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా వనరులు తక్కువగా ఉన్న అనేక దేశాలు పర్యాటకాన్ని ప్రధాన ఇంజిన్‌గా చేసుకొని అద్భుతమైన ఆర్థిక పురోగతి సాధించాయి. తెలంగాణలోనూ ఈ రంగానికి అపారమైన సామర్థ్యం ఉంది," అని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. పర్యాటక రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.హాస్పిటాలిటీ, హస్తకళలు, రవాణా రంగాల్లోని వేలాది ఎంఎస్ఎంఈలకు ఇది జీవనాధారమని చెప్పారు.

తెలంగాణ పర్యాటక రంగాన్ని పునరుద్ధరించడానికి, ప్రాచుర్యం, ప్రచారం కల్పించాడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. కొత్త పర్యాటక విధానంలో ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడానికి విస్తృత స్థాయి ప్రోత్సాహకాలు ఉన్నాయని తెలిపారు. 2047 నాటికి రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (GSDP)లో పర్యాటక రంగం వాటాను 10%కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి ప్రకటించారు.

శాతవాహనుల కాలం నుండి కాకతీయుల శిల్పకళ, కుతుబ్ షాహీ సమాధులు, చారిత్రక కట్టడాల వరకు రాష్ట్ర నిర్మాణ కళా వారసత్వాన్ని మంత్రి కొనియాడారు. కాకతీయ కళా తోరణం వంటి అద్భుతమైన నిర్మాణ సంపదను పర్యాటకులు తప్పక సందర్శించాలన్నారు.రాష్ట్ర పండుగలు, ఉత్సవాలు, హస్తకళలైన చేనేత, స్థానిక కళాకారుల పనితనం చిన్న వ్యాపారాలకు, సాంప్రదాయ జీవనోపాధికి మూలస్తంభాలని నొక్కి చెప్పారు. పోతన కవితల్లో ప్రతిబింబించే తెలంగాణ ప్రజల దయ, నిజాయితీ వంటి ఉన్నత విలువలను ప్రపంచానికి చాటిచెప్పాలన్నారు.

ప్రభుత్వం ప్రారంభించిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ఒక సాంస్కృతిక, సామాజిక విప్లవంగా మంత్రి అభివర్ణించారు. ఈ పథకం ద్వారా మహిళలు సులభంగా ప్రాంతీయ పర్యాటక, చారిత్రక ప్రదేశాలను సందర్శించడం, తద్వారా సాంస్కృతిక అవగాహన, సామాజిక సుసంపన్నత లభిస్తాయని ఆయన అన్నారు.

పర్యాటకుల కోసం అత్యాధునిక మౌలిక సదుపాయాలు, భద్రత, వసతి సౌకర్యాలను కల్పించాల్సిన అవసరాన్ని మంత్రి నొక్కి చెప్పారు. లగ్జరీ నుండి బడ్జెట్ వసతి వరకు ఏర్పాట్లు, సుదీర్ఘ ప్రయాణాలకు అనుకూలమైన రోడ్డు పక్కన సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. నూతన పర్యాటక వెబ్‌సైట్ ద్వారా రవాణా, వసతి, భద్రత, ఆకర్షణల గురించి సమగ్ర సమాచారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

ప్రజలు... పెట్టుబడిదారులు... పరిశ్రమ నిపుణులు... అందరూ కలిసి తెలంగాణ పర్యాటక సంపదను జాతీయఅంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేద్దాం. సాంస్కృతికంగా సమృద్ధిగా, ఆతిథ్యంతో, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా తెలంగాణను నిలుపుదాం" అని మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ మెనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరు, అడిషనల్ పీసీసీఎఫ్ సునీతా భగవత్, నిథమ్ డైరెక్టర్ వెంకట రమణ, ఎక్స్పీరియం చైర్మన్ రాందేవ్ రావు, ఆపరేషన్స్ (దక్షిణ & అంతర్జాతీయ), IHCL (ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్) ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాత్ వర్మ, రామోజీ ఫిల్మ్ సిటీ వైస్ ప్రెసిడెంట్ ఏ.వి.రావు, తదితరులు పాల్గొన్నారు



# రెవెన్యూ సేవలు మరింత సులభతరం

- **రియల్‌టైమ్‌లో పట్టాదారు పాస్ పుస్తకాల ఆటో మ్యుటేషన్**
- **2027 డిసెంబర్ నాటికి భూముల రీసర్వే పూర్తి కావాలి**
- **రెవెన్యూ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం**



**అమరావతి, డిసెంబర్ 9 (ప్రజాస్వరం):** రాష్ట్రంలో రెవెన్యూ సేవలు మరింత సులభతరం కావాలని, చిక్కుముడులు లేకుండా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పట్టాదారు పాస్ పుస్తకాలు సహా అన్నింటా రియల్ టైమ్‌లో ఆటో మ్యుటేషన్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ అయిన వెంటనే ఆటోమ్యూటేషన్ జరిగేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. పట్టాదారు పాస్ పుస్తకం కోసం భూ యజమానులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని, రెవెన్యూ శాఖలో ఏడాదిలోగా పూర్తి ప్రక్షాళన జరగాలని స్పష్టం చేశారు. దీనిపై ప్రతీ నెలా సమీక్షిస్తానని ముఖ్యమంత్రి వెల్లడించారు. సచివాలయంలో రెవెన్యూ శాఖపై ముఖ్యమంత్రి మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశానికి రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీసీఎల్ఏ అధికారులు హాజరయ్యారు. పీజీఆర్ఎస్‌లో మ్యుటేషన్, పట్టాదారు పాస్ పుస్తకాలకు సంబంధించి 1,97,915 ఫిర్యాదులు వచ్చాయని సమావేశంలో అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ల్యాండ్ నేచర్, క్లాసిఫికేషన్ సంబంధిత వివాదాల దరఖాస్తులు 1,00,835, రీసర్వే అనంతరం భూమి తగ్గిందని వచ్చిన పీజీఆర్ఎస్ దరఖాస్తులు 1,00,295, జాయింట్ ఎల్‌పీఎంలపై 2,40,479 ఫిర్యాదులు నమోదైనట్టు వివరించారు.

**రీసర్వే పురోగతిపై ప్రతీ నెలా నివేదిక**

ప్రస్తుతం 6,693 గ్రామాల్లో రీసర్వే పూర్తి కాగా, ఇంకా 10,123 గ్రామాల్లో చేయాల్సి ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అయితే 2027 డిసెంబరు నాటికి రీసర్వే ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ప్రతీ నెలా రీసర్వే పురోగతిపై నివేదిక ఇవ్వాలని నిర్దేశించారు. జాయింట్ లాండ్ పార్సెల్ మ్యాప్స్ వివాదాలను త్వరితగతిన పరిష్కరించాలని, భూమి వివరాలు డేటా బేస్ ఆన్‌లైన్‌లో ఉంటే ఈసీ జారీ చేయడం సులభమవుతుందని సీఎం అన్నారు. అలాగే 22ఏ జాబితా నుంచి తొలగించాలని వచ్చిన దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని సీఎం సూచించారు. 22ఏ ఫ్రీ హోల్డ్ భూముల విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. డాక్యుమెంట్ల వివరాలను ట్యాంపర్ చేయకుండా బ్లాక్ చెయిన్ లాంటి పటిష్ట వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. భూముల వివరాలు అన్నీ పారదర్శకంగా ఆన్‌లైన్‌లో ఉంచితే వివాదాలు తలెత్తవని సూచించారు. డిస్ప్యూటెడ్ ల్యాండ్స్‌గా పరిగణించడం, వాటిని తొలగించడం వంటి అధికారం ఇన్నాళ్లూ జాయింట్ కలెక్టర్‌కు ఉండగా... ఇకపై డిస్ప్యూటెడ్ ల్యాండ్స్ పరిష్కరించే అధికారం ఆర్డీవోలకు ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. చుక్కల భూములను 22ఏ జాబితా నుంచి తొలిగించే ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. 1999 వరకూ ప్రాథమిక సహకార సంఘాల వద్ద తాకట్టు పెట్టిన అసైన్డ్ భూములు కూడా 22ఏ జాబితా నుంచి తొలిగించాలన్నారు. బంజరు భూములు 1954 కంటే ముందు సేల్ డీడ్స్ రిజిస్టర్ ఆఫ్ హోల్డింగ్స్‌ను 22ఏ నుంచి తొలగించాలని చెప్పారు.

**రిజిస్ట్రేషన్ల శాఖలో రూ.10,169 కోట్ల రెవెన్యూ లక్ష్యం**

'మున్సిపల్ పరిధిలో ఉన్న అసైన్డ్ భూములు మంత్రుల కమిటీ సిఫార్సు మేరకు 250 చదరపు గజాల లోపు స్థలాల్ని 50 శాతం బేస్ వాల్యూతో రెగ్యులరైజ్ చేయండి. అలాగే ఆక్వా కల్చర్ చేస్తున్న అసైన్డ్ భూముల్ని సబ్ రిజిస్ట్రార్ విలువ ప్రకారం రెగ్యులరైజ్ చేయాలి. అలాగే ...10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు కుల ధృవీకరణ పత్రం వెంటనే పొందేలా కార్యాచరణ రూపొందించాలి. ఆర్టీజీఎస్‌తో అనుసంధానించిన సమాచారం ద్వారా ఆదాయ ధృవ పత్రం ఇవ్వాలి. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో రూ.10,169 కోట్ల రెవెన్యూ లక్ష్యంగా పెట్టుకున్నాం. మార్కెట్ విలువలతో భూమి విలువలు అప్ గ్రేడ్ చేయండి.' అని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు.

**రెవెన్యూ శాఖలో 86 శాతం వివాదాలు పరిష్కారం**

గత ఏడాది జూన్ 15 నుంచి ఈ ఏడాది డిసెంబర్ 1వ తేదీ వరకు రెవెన్యూ శాఖకు 5,28,217 గ్రీవెన్సులు రాగా, వాటిలో 4,55,189 అంటే 86 శాతం గ్రీవెన్సులు పరిష్కారమయ్యాయని అధికారులు తెలిపారు. పరిశీలనలో మరో 73 వేల వరకు గ్రీవెన్సులు ఉన్నాయని, ఎవరైనా అర్జీల పరిష్కారంపై అసంతృప్తి వ్యక్తం చేస్తే... ఆ ఫిర్యాదులను తిరిగి ఓపెన్ చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే జూన్ 2024 నుంచి ఇప్పటివరకు 22ఏ జాబితా నుంచి తమ భూముల వివరాలు తప్పించాలని కోరుతూ 6,846 దరఖాస్తులు దాఖలు కాగా... ఎక్స్ సర్వీస్‌మెన్, రాజకీయ బాధితులు, స్వాతంత్ర్య సమరయోధులు, 1954 కంటే ముందు అసైన్డ్ భూములు కలిగిన వాళ్ల భూములు మాత్రం 22ఏ నుంచి తొలిగించనున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

## ప్రశ్నించ గలిగే అభ్యర్థిని గెలిపించండి: ఆర్జేసి కృష్ణ




**ఖమ్మం,డిసెంబర్ 9 (ప్రజాస్వరం):** ప్రజా సమస్యల పై ప్రభుత్వాలను ప్రశ్నించే సర్పంచ్ అభ్యర్థిని గెలిపించాలని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుండాల కృష్ణ కోరారు.వైరా మండల పరిధిలోని రెబ్బవరం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్, సిపిఐ (ఎం),జనసేన పార్టీల ఉమ్మడి సర్పంచ్ అభ్యర్థిని గా పోటీ చేస్తున్న మెండెం రాములమ్మ విజయాన్ని కాంక్షిస్తూ ఆయన మంగళవారం గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ మున్నూరు కాపులకు బి ఆర్ ఎస్ హయాంలోనే న్యాయం జరిగిందన్నారు.ఆ కులస్తులకు మంత్రి వర్గంలో స్థానం కల్పించడంతో పాటు వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్ లుగా,పార్టీ బాధ్యులుగా నియమించిన కేసీఆర్ వారిని సముచితంగా గౌరవించారన్నారు. అదేవిధంగా కోకాపేట లో స్థలాన్ని కూడా కేటాయించారని తెలిపారు.బి సి లకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన రేవంత్ సర్కార్ దానిని పూర్తిగా విస్మరించిదని ఆరోపించారు.రాములమ్మ కుమారుడు ఇప్పటికే వార్డు మెంబర్ గా ప్రజాసేవలో వున్నారని,అదే కుటుంబం నుంచి సర్పంచ్ గా పోటీ చేస్తున్న రాములమ్మ ను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ మరింత సేవ చేస్తారన్నారు. పాలకులను, అధికారులను ప్రశ్నించే తత్వం కలిగిన ఆమెను గెలిపించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం )వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం,నాయకులు రాంబాబు,బిఆర్ఎస్ నాయకులు కట్టా కృష్ణార్జునరావు,విశ్వేశ్వర రావు లతో పాటు పలువురు జనసే న నాయకులు పాల్గొన్నారు.

## 8వ వార్డులో హోరెత్తిన పూజారి దుర్గ ప్రచారం.

**బూర్గంపాడు,డిసెంబర్ 9 (ప్రజాస్వరం)**

బూర్గంపాడు మండలం సోంపల్లి గ్రామంలో 8వ వార్డులో సర్పంచ్ అభ్యర్థి తాటి లక్ష్మి, వార్డు అభ్యర్థి పూజారి దుర్గ ప్రచారం బ్రహ్మాండంగా సాగింది. సోంపల్లి బీసీ కాలనీలో పెట్టిన సభలో కాలనీ ప్రజలు మహిళలు యువకులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు, ఒకటే నినాదం ఒకటే మాట అందరి ఓటు తాటి లక్ష్మి,పూజారి దుర్గ వైపే అని అంటున్న ప్రజలు... ముఖ్యఅతిథిగా హాజరైన సోంపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు నస్మారి లక్ష్మీనారాయణ దుర్గ గెలుపు ద్వారానే సోంపల్లి కాలనీ అభివృద్ధి సాధ్యమవుతుంది. 30ఏళ్లుగా సోంపల్లి కాలనీ ప్రజలతో అనుబంధం ఉంది మీతో కలిసి మెలిసి ప్రయాణం చేసిన వ్యక్తిగా మాట ఇస్తున్న సర్పంచ్ అభ్యర్థి: తాటి లక్ష్మి, వార్డు అభ్యర్థి:పూజారి దుర్గను గెలిపించమని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాటి వీరాంజనేయులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,గ్రామ పెద్దలు,మహిళలు,యువకులు, స్థానిక ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.



# ప్రతి కుటుంబానికి సొంతిల్లు అందించడమే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

గృహ నిర్మాణ , సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ముఖ్యంగా అన్ని వర్గాల ప్రజలకు అనువుగా ఉండే ధరల్లో ఉండేట్లుగా ఒక సమగ్ర విధాన రూపకల్పనకు తెలంగాణా రైజింగ్ 2047 - గ్లోబల్ సమ్మిట్ చక్కటి వేదిక అని ఆయన పేర్కొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న గ్లోబల్ సమ్మిట్ లో భాగంగా మంగళవారం 'అఫర్డ్ బుల్ హౌసింగ్ పాలసీ ఫర్ అర్బన్ ఫ్యూచర్ - తెలంగాణా మోడల్ 2047' అనే అంశంపై జరిగిన సదస్సులో మంత్రి కీలక ఉపన్యాసం చేశారు. పెరుగుతున్న పట్టణీకరణతో పాటు, విస్తృతమవుతున్న గృహ అవసరాలను దృష్టిలో ఉంచుకుని దేశానికి ఆదర్శంగా ఉండేలా ఆర్థికంగా సాధ్యమైన, పర్యావరణ పరిరక్షణకు అనుగుణమైన, సాంకేతికత ఆధారిత అంశాలు ఉండేలా సమగ్రమైన పాలసీని రూపొందిస్తున్నామని వివరించారు. తెలంగాణా సమగ్ర అభివృద్ధి కి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించనున్న విధానాలు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రోల్ మోడల్ గా నిలుస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు అమలైన గృహ కార్యక్రమాల ద్వారా సాధించిన పురోగతిని వివరిస్తూ గతంలో ఇందిరమ్మ పథకం ద్వారా సుమారు 42 లక్షల ఇండ్లను నిర్మించగా, ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమంలో సుమారు 3.5 లక్షల ఇళ్ల నిర్మాణాలు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని మంత్రి తెలిపారు. అంతే కాకుండా మధ్య తరగతి కుటుంబాల కోసం హౌసింగ్ బోర్డ్, రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ తదితర సంస్థల ద్వారా సుమారు ఒక లక్ష ఇళ్లు నిర్మించినట్లు వివరించారు. అయినా కూడా రాష్ట్రంలో గృహాల డిమాండ్, సరఫరా మధ్య భారీ అంతరం ఉందని, ఈ అంతరాన్ని పూడ్చడానికి, వ్యక్తిగత పథకాలకు పరిమితం కాకుండా, ప్రభుత్వ లక్ష్యానికి మూలస్తంభం లాంటి తెలంగాణ 2047ను ఆదాయంతో సంబంధం లేకుండా ఒక సమగ్ర గృహ నిర్మాణ విధానాన్ని రూపొందిస్తున్నామని ప్రకటించారు. పట్టణ ప్రాంతాల అవసరాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, సమతుల్యతతో కూడిన "గృహ నిర్మాణ తెలంగాణ నమూనా 2047" వైపు చారిత్రక అడుగు వేస్తున్నాం. ఈ నమూనా తప్పనిసరిగా ఆర్థికంగా లాభదాయకంగా, సామాజికంగా సమ్మిళితంగా, పర్యావరణపరంగా బాధ్యతాయుతంగా, సాంకేతికత ఆధారితంగా ఉండాలని తమ ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ప్రభుత్వ ప్రవేట్ భాగ్యస్వామ్యంతో ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్డు మధ్యలో పేద మధ్యతరగతి ప్రజల కోసం కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ తరహాలో ఇళ్ల ను నిర్మించాలన్న ఆలోచన చేస్తున్నాము. తెలంగాణను మూడు ప్రధాన ప్రాంతాలుగా విభజించి వ్యూహాలను రూపొందించామని తెలిపారు.



తెలంగాణ కోర్ అర్బన్ ప్రాంతం మురికివాడల యథాస్థితి పునరాభివృద్ధి, ఐటీ కారిడార్లలో అందుబాటు అద్దె గృహ నిర్మాణం, రవాణా కారిడార్ల వెంబడి గృహాల ఏర్పాటు. పరి-అర్బన్ ప్రాంతం ప్లాన్డ్ టౌన్‌షిప్‌లు, భారత్ సిటీ వంటి గ్రీన్‌ఫీల్డ్ శాటిలైట్ టౌన్‌లు, పారిశ్రామిక ప్రాంతాలలో కార్మికుల గృహ వసతి. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలు చిన్న/మధ్య తరహా టౌన్‌షిప్‌లు, పారిశ్రామిక పార్కులు, లాజిస్టిక్స్ హబ్‌లతో అనుసంధానించబడిన అద్దె/కార్మికుల గృహ నిర్మాణం ప్రధాన వ్యూహాలుగా తయారుచేశాం. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సమగ్రమైన అఫర్డ్ బుల్ హౌజింగ్ పాలసీ ఆవశ్యకత చాలా ఉన్నదన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కొత్తగా రూపొందించనున్న అఫర్డబుల్ హౌసింగ్ పాలసీలో ఇటీవల ప్రకటంచిన క్యూర్, ప్యూర్, రేర్ జోన్లకు అనుగుణంగా అనుసరించాల్సిన విధానాలను నిర్దేశించనున్నామని వెల్లడించారు. ఈ సెమినార్ లో ప్రపంచ బ్యాంకు ప్రతినిధి శ్రీ అభిజిత్ శంకర్ రే, రాంకీ సి ఎం డి శ్రీ నంద కిషోర్, హడ్ కో ఎం డి శ్రీ వి. సురేష్ , క్రెడాయ్ ప్రెసిడెంట్ శ్రీ జి. రామ్ రెడ్డి, ASBL సీఈఓ అజితేష్, కేర్ ప్రతినిధి ప్రీతం మెహెరా తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాన్ని,10 వ వార్డు అభివృద్ధి చేస్తాం

# అవకాశం ఇవ్వండి..



- **గత పాలకుల నిర్లక్ష్యంతో గ్రామ అభివృద్ధి పడకేసింది.**
- **చదువుకున్న యువతను ఆశీర్వదించండి.**
- **వేముల గ్రామ 10 వ వార్డు అభ్యర్థి సంధ్య ఈశ్వర్ కుమార్**

**వేముల,డిసెంబర్ 09(ప్రజాస్వరం):** జోగులాంబ గద్వాల జిల్లా,ఎర్రవల్లి మండల పరిధిలోని వేముల గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని గత పాలకుల నిర్లక్ష్యంతో గ్రామం అభివృద్ధి గతంలో వెనుకబాటు తనానికి గురైందని ఒక్కసారి అవకాశం ఇస్తే గ్రామాన్ని,10 వ వార్డును అభివృద్ధి పరుస్తామని 10 వ వార్డు అభ్యర్థి సంధ్య ఈశ్వర్ కుమార్ తెలిపారు. అభివృద్ధి లక్ష్యంగా,గ్రామ అభివృద్ధి మార్పు కోసం,చదువుకున్న యువతగా మీ ముందుకు వస్తున్నామని,గ్రామ ప్రజలు ఆలోచన చేయాలన్నారు.భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో ఓటు హక్కు అతి విలువైనదని, డబ్బు,మద్యం,వంటి ప్రలోభాలకు ఆశపడకుండా నీతి,నిజాయితీతో గ్రామంలో నెలకొన్న సమస్యలపై పోరాటం చేస్తున్న తమకు ఒకసారి అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలని తెలిపారు.ఎన్నికల్లో తమకు అవకాశం ఇస్తే గ్రామ అభివృద్ధి రూపురేఖలు మారుస్తామని హామీ ఇచ్చారు.





# తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు ఒక శుభపరిణామం

- తెలంగాణ స్ఫూర్తి తరతరాల పాటు వికసించాలి
- డిఆర్ఓ భుజంగరావు
- జయ జయహే తెలంగాణ గీతాన్ని ఆలపించిన జిల్లా అధికారులు సిబ్బంది

మెదక్ డిసెంబర్ 09 (ప్రజా స్వరం)

తెలంగాణ అవతరణ ఉత్సవం పురస్కరించు కొని మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ అండ్ బి ఈ.ఈ వేణు,డిఆర్ఓ భుజంగరావు, అదనపు ఎస్పీ మహేందర్, ఇతర జిల్లా అధికారులతో కలిసి తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ భుజంగరావు మాట్లాడుతూ ప్రజలలో ఐక్యత, ఆత్మగౌరవాన్ని పెంపొందించే ప్రతీక గా తెలంగాణ తల్లి నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవం, తెలంగాణ తల్లి విగ్రహా విష్కరణ కార్యక్రమాన్ని రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు 10 అడుగుల ఎత్తులో విగ్రహం, బేస్‌మెంట్ 4 అడుగులు, విగ్రహం కింద ఉండే 2 అడుగుల పీఠంతో కలిపి మొత్తం 16 అడుగుల ఎత్తు కలిగిన తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ చేసుకోవడం జరిగిందని అన్నారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలను కొనియాడుతూ, తెలంగాణ తల్లి యొక్క గొప్పదనాన్ని సుదీర్ఘం గా వివరించారు.అదనపు ఎస్పీ మహేందర్ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించాలని చెప్పడం మన జిల్లా కలెక్టరేట్ లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం శుభ పరిణామం అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయడంతో వివిధ పనులపై అక్కడికి వెళ్లే ప్రజలను ఆకట్టుకుంటుందని చెప్పారు.అంతకు ముందు జయ జయహే తెలంగాణ గీతాన్ని జిల్లా అధికారులు సిబ్బంది ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈ వేణు, డి.ఈ టెక్నికల్ కరుణ, ఏ డబ్ల్యుఈ అరుణ్ రెడ్డి, డిఆర్డిఓ పిడి శ్రీనివాస రావు, పరిపాలన అధికారి యూనస్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.







# తెలంగాణ ఇచ్చిన దేవత సోనియా గాంధీ




- ఇచ్చిన మాట కట్టుబడేది కాంగ్రెస్ పార్టీ
- మున్సిపల్ మాజీ చైర్మన్ తోడుపునూరి చంద్రపాల్
- ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

మెదక్ డిసెంబర్ 09 (ప్రజా స్వరం)

తెలంగాణ ఇచ్చిన దేవత ఏఐసిసి అధినేత్రి సోనియా గాంధి అని మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ తోడుపునూరి చంద్రపాల్ అన్నారు. డిసెంబర్ 9 సోనియమ్మ జన్మదినాన్ని పురస్క రించుకొని మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మందుగుల గంగాధర్ ఆధ్వర్యంలో ఆమె జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు. అనంతరం చంద్రపాల్ మాట్లాడుతూ 12 వందల మంది అమరవీరుల ఆత్మ బలిధానాలను గుర్తించి చలించిపోయి సోనియమ్మ తెలంగాణ ఇచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా కనుమరుగు అవుతుం దని తెలిసినప్పటికి ఇచ్చిన మాటకు కట్టుబడి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే పార్టీ అన్నారు. నెహ్రూ మెదలుకొని సోనియా గాంధీ వరకు దేశానికి ఎంతో సేవ చేశారన్నా రు. వారిది త్యాగాల కుటుంబం అని కొనియా డారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ రాగి అశోక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మధు సూదన్, మెదక్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు లక్ష్మి నారాయణ.మంగ కృష్ణగౌడ్, మంగ రమేష్‌గౌడ్, బట్టి సులోచన, కాంగ్రెస్ నాయకులు స్వరూప, హరిత, జ్యోతి, గోదాల సాయి, ఉమర్, గోదాల కృష్ణ, లాలు, మన్సూర్, గాడి రమేష్, దేవుల నాయక్, ప్రవీణ్ కుమార్, అమర్, మజాబిన్, చింతల శీను తదితరులు పాల్గొన్నారు.







# ఉద్యమ ఫలితమే తెలంగాణ ఏర్పాటు

- డిసెంబర్ 9 న రాష్ట్ర ఏర్పాటుకు తొలి అడుగు..
- కేసీఆర్ దీక్ష ఫలితమే పోరాటమే విజయ్ దివాస్.
- మాజీ మున్సిపల్ చైర్మన్ ఆరేళ్ళ మల్లికార్జున్ గౌడ్.

మెదక్ డిసెంబర్ 09 (ప్రజా స్వరం)

తుది దశ తెలంగాణ ఉద్యమ ఫలితంగా రాష్ట్ర ఏర్పాటుకు తొలి అడుగుపడిన రోజు డిసెంబర్ 9 విజయ్ దివస్ అని మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ళ మల్లికార్జున్ గౌడ్ అన్నారు. మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విజయ్ దివస్ కార్యక్రమంలో భాగంగా మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ళ మల్లికార్జున్ గౌడ్, జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు యం.లావణ్య రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి కలిసి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ తల్లి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. విజయానికి సూచికగా పింక్ బెలూన్లను ఎగురవేశారు. ఈ సందర్భంగా మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ళ మల్లికార్జున్ గౌడ్ మాట్లాడుతూ సబ్బండ వర్గాల పోరాటం, అమరుల త్యాగం, కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షతో ఢిల్లీ పీఠం వణికి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించి నేటికి 16 ఏండ్లయిందని అన్నారు. నవంబర్ 29 దీక్ష దివాస్ లేకుంటే డిసెంబర్ 9 విజయ్ దివాస్ లేదని, డిసెంబర్ 9 లేకుంటే జూన్ 2 లేదని వెల్లడించారు. కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు తలొగ్గి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించిన రోజే డిసెంబర్ 9 అని గుర్తు చేశారు. డిసెంబర్ 9నే 60 ఏండ్ల తెలంగాణ ఆకాంక్షకు కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష వల్ల ఒక రూపం వచ్చిందని తెలిపారు. అంతటి ఘనమైన చారిత్రక ఘట్టాన్ని మరోసారి స్మరించుకుంటూ, ఆనాడు కేసీఆర్ తెలంగాణ కోసం చేసిన త్యాగాన్ని గుర్తు చేస్తూ, ప్రత్యేక రాష్ట్రప్ర కటన సిద్ధించిన రోజును నేడు విజయ్ దివాస్ అని పేర్కొన్నారు. కేసీఆర్‌దీక్ష, తెలంగాణ పోరాటం, విద్యార్థుల త్యాగాలను ప్రజలకు, భవిష్యత్తు తరాలకు గుర్తుచేయాలని తెలిపారు. దీక్ష దివాస్ ఫలితంగా నేడు విజయ్ దేవస్ అని అన్నారు. కెసిఆర్ గారి పోరాటం దీక్ష దివాసులు చావు నోటి దగ్గర దాక వెళ్లి చివరి దశలో ఉండగా సంపన్న వర్గాల పోరాటానికి కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 9 ప్రకటించారని చెప్పారు. కెసిఆర్ ఆమరణ దీక్ష సంపన్న వర్గాల పోరాట ఫలితమే సంపూర్ణ కృషితో యావత్ ప్రపంచం పోరాడిన రోజు తెలంగాణ వచ్చిందని అన్నారు. ఈ తెలంగాణ పోరాటంలో ఎందరో విద్యార్థులు అమరులయ్యారని వారిని గుర్తు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ శేరి. సుభాష్ రెడ్డి తో కలిసి ప్రభుత్వ దవాఖానల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు కొట్టాల విశ్వం ఆర్కే శ్రీనివాస్ జయరాజ్, మాయ మల్లేశం, సోహెల్, నాయకులు కిష్టయ్య, మోచి కిషన్, గట్టేష్, నగేష్, మహమ్మద్ హుస్సేన్, జుబెర్ అహ్మద్, శ్రీకాంత్, సంతోష్, నరేష్, లక్ష్మీనారాయణ, మధు, శంకర్, ఇస్మాయిల్, రామచంద్రారెడ్డి, యాదగిరి, లక్ష్మణ్ రవి, తదితరులు పాల్గొన్నారు.







# అక్రమంగా తరలిస్తున్న 384 క్వాటర్ల మద్యం సీజ్

**నార్సింగి డిసెంబర్ 09 (ప్రజా స్వరం)**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ బీమరి సృజన తెలిపిన వివరాల ప్రకారం నార్సింగి మండల ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ సభ్యులైన ఆర్.ఐ శ్రీధర్, ఏఎస్ఐ మిస్బాహ్ ఉద్దీన్, వీడియో గ్రాఫర్ వేణు గోపాల్ గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండలంలో పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నార్సింగి మీర్జా పల్లి మార్గంలో మధ్యాహ్నం 3 గం లకు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక కారులో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న 5 కార్టన్ల మద్యం క్వార్టర్లు (2 ఐబీ, 3 మాక్డవల్స్) ను పట్టుకున్నారు. అనంతరం నార్సింగి నర్సంపల్లి మార్గం లో తనిఖీలు నిర్వహిస్తుండగా 4:20 గం లకు నర్సంపల్లి వైపు వెళుతున్న ఆటో ను తనిఖీ చేశారు. ఆటోలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న 3 కార్టన్ల ఐబీ క్వార్టర్ మద్యం బాటిళ్లు, 1 కార్టన్ కింగ్ ఫిషర్ బీర్ బాటిల్లను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలో స్వాధీనం చేసుకున్న మొత్తం 69.12 లీటర్లు ఉన్న 8 క్వార్టర్ల మద్యం (384 క్వార్టర్లు) 7.8 లీటర్లు ఉన్న 1 కార్టన్ బీర్లు (12) మద్యాన్ని స్థానిక పోలీస్ స్టేషన్ లో అప్పగించగా, పంచనామా నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న కారు డ్రైవర్, ఆటో డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బీమరి సృజన తెలిపారు.



# ఘోర రోడ్డు ప్రమాదం, ఆటోను ఢీ కొట్టిన కారు మహిళా మృతి పలువురికి గాయాలు

**నార్సింగి డిసెంబర్ 09 (ప్రజా స్వరం)**

జాతీయ రహదారి 44 పై చెట్ల చెత్తను తొలగిస్తుండగా వాహనం ఢీ కొట్టి కార్మికురాలు మృతి చెందగా పలువురు గాయ పడిన సంఘటన మండల పరిధి లోని జాతీయ రహదారి 44 వల్లూరు శివారులో జరిగింది. ఎస్ఐ బీమరి సృజన తెలిపిన వివరాల ప్రకారం చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన గూన సత్తెమ్మ (49) గత రెండు సం గా జీఎంఆర్ రోడ్డు మెయింటెనెన్స్ కాంట్రాక్టర్ వద్ద కాంట్రాక్ట్ లేబర్ గా పని చేస్తుంది. మంగళవారం రోజు మాదిరిగా విధులకు హాజరైన సత్తెమ్మ వల్లూరు వద్ద జాతీయ రహదారి 44 పై డివైడర్ పై ఉన్న పూల చెట్ల వద్ద సఫాయి పనికి వెళ్ళింది. ఈ క్రమంలో సత్తెమ్మ ఉ 11:40 గం లకు చెత్తను రోడ్డు పక్కగా వేయడానికి వెళుతుండగా నిజామాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న ఇన్నోవా కారు ను డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ ముందు వెళుతున్న అటో ను ఢీ కొట్టగా, అటో రోడ్డు కు పక్కగా ఉన్న సత్తెమ్మను ఢీ కొట్టింది. ఆటో ను కారు బలంగా ఢీ కొట్టడం వల్ల ఆటో తో సహా సత్తెమ్మ ఎగిరి రోడ్డు పక్కన గల గుంతలో పడిపోయారు. ప్రమాద తీవ్రత వల్ల ఎగిరి గుంతలో పడిన సత్తెమ్మ కు తీవ్ర గాయాలు అయి అక్కడిక్కడే మృతి చెందగా, అటో లో ప్రయాణిస్తున్న అటో డ్రైవర్ హాలావత్ సుధాకర్, ప్రయాణికులు స్వరూప, స్వప్న, దుర్గయ్య లకు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్ కారును రోడ్డు పై వదిలి పారిపోయాడు. గాయపడిన వారిని చేగుంట లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా, ప్రమాదం లో మరణించిన సత్తెమ్మ మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం రామాయంపేట కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బీమరి సృజన తెలిపారు. ఆటోను ఢీ కొట్టిన కారు పై "నిర్మల్ జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు" అని బోర్డు ఉంది.



# తెలంగాణకు తల్లి వంటిది సోనియమ్మ

- **జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి**
- **జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు**

**ఖమ్మం,డిసెంబర్ 9 (ప్రజాస్వరం):**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సోనియా గాంధీ కృషి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించనిదగిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ అన్నారు.జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో సోనియా గాంధీ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి,శాసనమండలి మాజి సభ్యులు పోట్ల నాగేశ్వరరావు,శాసనసభ మాజి సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, నగర కాంగ్రెస్ కమిటి మాజీ అధ్యక్షులు మహ్మద్ జావేద్, రాష్ట్ర ఓబీసీ సెల్ నాయకులు వడ్డేబోయిన నరసింహారావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్, జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు,పుచ్చకాయల వీరభద్రం, మొక్క శేఖర్ గౌడ్, సయ్యద్ గౌస్,కార్పొరేటర్ లకావత్ సైదులు, కన్నం వైష్ణవిప్రసన్నకృష్ణ, మాజి కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరరావు,భానోత్ రాజు,బిక్షపతి రాథోడ్, రాష్ట్ర యస్ సి సెల్ కన్వీనర్ దర్శి చిన్నారావు,నగర ఐ యన్ టి యు సి అధ్యక్షులు నరాల నరేష్ నాయుడు, షేక్ అబ్బాస్ బేగ్,మరియు శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు .ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ... 1946 డిసెంబర్ 9న ఇటలీలో జన్మించిన సోనియా, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని వివాహం చేసుకున్నారని, రాజీవ్ మరణానంతరం ఆమె భారత రాజకీయాల్లోకి అడుగుపెట్టారనీ గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా అత్యధిక కాలం పనిచేసిన వ్యక్తిగా ఆమె రికార్డు సృష్టించారని, 1998లో పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ఆమె, తన నాయకత్వ పటిమతో పార్టీకి కొత్త ఊపిరి పోశారన్నారు.ఆమె సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ వరుసగా రెండుసార్లు (2004, 2009) కేంద్రంలో అధికారాన్ని కైవసం చేసుకుందని ఒకానొక దశలో దేశంలోని 16 రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడటంలో ఆమె కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆమె విదేశీ మూలాల అంశంపై శరద్ పవార్, పి.ఎ. సంగ్మా వంటి నేతల నుంచి వ్యతిరేకత



ఎదురైనప్పటికీ, పార్టీ శ్రేణుల మద్దతుతో తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు అని అన్నారు .రాజకీయాల్లోకి వచ్చిన తొలినాళ్లలో ఇటాలియన్ యాసతో హిందీ మాట్లాడిన సోనియా, అనతికాలంలోనే భారత రాజకీయాల్లో అత్యంత ప్రభావవంతమైన శక్తిగా ఎదిగారని, వయసు, ఆరోగ్య కారణాల దృష్ట్యా 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్న సోనియా గాంధీ, ప్రస్తుతం రాజ్యసభ సభ్యురాలిగా కొనసాగుతున్నట్టు తెలిపారు.పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో కాంగ్రెస్‌కు మార్గనిర్దేశం చేస్తూ క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. తెలంగాణ ఏర్పాటుకు సోనియమ్మ కృషిని కొనియాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆమె పుట్టిన రోజును తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవంగా జరుపుకోవడం శుభపరిణామం అని జిల్లా కాంగ్రెస్ పార్టీ తరపున రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు గజ్జి సూర్య నారాయణ,బమ్మిడి శ్రీనివాస్ యాదవ్,మూడు ముంతల గంగరాజు.యాదవ్,ముళ్ళపూడి సీతారాములు,భూక్యా సురేష్ నాయక్,కిషోర్,హరి నాయక్,పర్వత శ్రీనివాస్,సంగయ్య,లింగాల రవికుమార్,కిషన్,గడ్డం వెంకటయ్య,బీరెడ్డి రమేష్,విప్లవ కుమార్,బండి నాగేశ్వరరావు,పుల్లారావు,తూములూరి లక్ష్మీ నరసింహారావు,యశ్వంత్, యాసిన్,మహమూద్,ఏపూరి మల్లిఖార్జునరావు,గుమ్మా రోశయ్య, కావేటి నారాయణ,రమణ,ఫరీద్ ఖాద్రి,చల్లా ప్రతిభారెడ్డి,బలుసు లక్ష్మీ,నీలవేణి,దామా స్వరూప,చంద్రిక,సుగుణ రాకేష్, కిరణ్ కుమార్,నాగేశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ ద్వారానే గ్రామ స్వరాజ్యం వస్తుంది

- **గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మల్లి బాబు యాదవ్**

**ఖమ్మం,డిసెంబర్ 9 (ప్రజాస్వరం):**

కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో మంగళవారం నాడు గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచార పర్వం ప్రారంభమైంది. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ డైరెక్టర్ రాం రెడ్డి గోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా ధరావత్ అనురాధను గెలిపించాలని ఇంటింటి ప్రచారంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, కామేపల్లి మాజీ జెడ్పిటిసి మేకల మల్లిబాబు యాదవ్, పిఎసిఎస్ అధ్యక్షులు ధనియాకుల.హనుమంతరావు, మద్దినేని రమేష్ బాబు పాల్గొన్నారు.గ్రామపంచాయతీ 12వ వార్డు ధరావత్ లాలు, 7వ వార్డు మేకల మల్లికార్జునరావు, 9వ వార్డు ధనియాకుల బేబీ, ఎనిమిదవ వార్డు ధనియాకుల మాధవరావు కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ ఈనాడు కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఇందిరమ్మ ఇల్లు, మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం, గ్రామాలలో ఉచిత కరెంటు సదుపాయం, రైతుబంధు లాంటి పథకాలను ప్రభుత్వం ఎంత నష్టాలలో ఉన్నప్పటికీ పేద ప్రజలకు పథకాలను అమలు చేస్తున్నారు. మనం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకుంటే గ్రామ స్వరాజ్యం ఏర్పడుతుందని, గతంలో కాంగ్రెస్ పార్టీ గెలిచినప్పుడు మాత్రమే గ్రామంలో అభివృద్ధి జరిగిందని,కాబట్టి ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు నుంచి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ ఫతే మహమ్మద్ శీలం పుల్లయ్య, పాటిబండ ప్రసాదు, షేక్ రబ్బానీ పాషా,దొడ్ల వేణు భూక్య నాగేంద్రబాబు, బాదావత్ నాగరాజు, ఉప్పు గండ్ల వీరభద్రం జన్నారపు లింగయ్య, అంబడిపూడి అప్పయ్య ధరావత్ సేవలాల్, జక్కంపూడి వెంకటేశ్వర్లు, ధరావత్ హరిచంద్ర, బత్తుల ఉపేందర్ దుద్దుకూరి వెంకటేశ్వర్లు తోటకూరి భద్రయ్య, కొమినేని శ్రీను ధరావత్ రవి,నరేష్ సొట్టు,చల్ల హరి చల్ల మల్లయ్య, బానోత్ రామ చంద్ర,ధరావత్ విన్ని బాబు,దూగుంట్ల వీరన్న మరియు తదితరులు పాల్గొన్నారు.

# సోలిపూర్ ను లూటీ చేయడం కాదు బ్యూటీ చేస్తాను.

- **ఎమ్మెల్యే మెగా రెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి.**
- **సోలిపూర్ సర్పంచ్ అభ్యర్థి తీనేటి సింధుజా రెడ్డి.**

**వనపర్తి ప్రతినిధి,డిసెంబర్ 09 (ప్రజాస్వరం):**



సోలిపూర్ గ్రామ సర్పంచుగా తనను గెలిపిస్తే లూటీ చేయడం కాదు బ్యూటీ చేస్తానని (కత్తెర గుర్తు) సర్పంచ్ అభ్యర్థి తీనేటి సింధుజారెడ్డి స్పష్టం చేశారు. మొదటి విడత సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మంగళవారం ఖిల్లా గణపురం మండలంలోని సోలిపూర్ గ్రామంలో సింధుజా రెడ్డితో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సింధుజా రెడ్డి మాట్లాడుతూ తనను సర్పంచుగా గెలిపిస్తే గ్రామ ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ ఎమ్మెల్యే మెగా రెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. సోలిపూర్ గ్రామాన్ని మండల కేంద్రంగా సాధించేందుకు ఇప్పటికే తమ ప్రయత్నాలు ముమ్మరం చేశామని, ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో అధికారం ఒరగబెట్టిన ఓ నాయకుడు డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరిట ఇసుక అమ్ముకొని భారీ ఎత్తున అవినీతికి పాల్పడి గ్రామనట్ట నడిబొడ్డున మూడు అంతస్తుల భవనాన్ని అవినీతి డబ్బులతో నిర్మిస్తున్నాడని వివరించారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికై హైదరాబాద్ లో నివాసం ఉండేవారు తమపై లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నారని తాము గ్రామంలోనే ఉంటూ వ్యాపారం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, తమ పిల్లలు హైదరాబాద్ లో చదువుతుండడం వల్ల వారిని చూసేందుకు కేవలం 15 రోజులకు ఒకసారి మాత్రమే ఒక్కరోజు చూసి వస్తానని అన్నారు. గ్రామస్తుల ఆశీర్వాదంతో తాను గెలవడం ఖాయమని తేల్చి చెప్పారు.






# ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే చర్యలు

**మాసాయిపేట డిసెంబర్10 (ప్రజాస్వరం)**

మండలంలోని హకీంపేట శివారులో ఎఫ్ఎస్టి(ఫ్లయింగ్ స్క్వాడ్ టీం) బృందం ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తోంది. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా మద్యం, డబ్బు అక్రమ రవాణాను అరికట్టేందుకు తనిఖీలు చేపట్టారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బంది వాహనాలను పరిశీలిస్తున్నారు. అక్రమంగా మద్యం తరలించినా, ప్రలోభాలకు పాల్పడినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజాస్వరం PRAJASWARAM తెలుగు దినపత్రిక
10.12.2025
బుధవారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com




## ఘనంగా సోనియా గాంధీ 79వ జన్మదిన వేడుకలు

**విశాఖ దక్షిణ,డిసెంబర్ 9(ప్రజాస్వరం)**

కాంగ్రెస్ పార్టీ మాజీ జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి సోనియా గాంధీ 79 వ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు ఎల్ ఎన్ హాసిని వర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పార్టీ నాయకులు సోనియా గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు, ఈ రోజు సాయంత్రం విశాఖపట్నం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హాసిని వర్మ రాజు మాట్లాడుతూ సోనియా గాంధీ కాంగ్రెస్ పార్టీకి చేసిన త్యాగాలను, పార్టీని నడిపించే విధానాన్ని కొనియాడారు. ఆమెపై విదేశీ ముద్ర వేసి కొందరు బీజేపీ దుష్ట శక్తులు పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నాయని అటువంటి ఆగడాలు ఇక చెల్లవని భవిష్యత్తులో కేంద్రంలో రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఎవరెన్ని ఆటంకాలు ఏర్పరిచిన ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని అన్నారు.కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టి రెండు సార్లు పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత ఆమెకు చెందుతుందని, సోనియా గాంధీ సేవలు ఎనలేనివని నాయకులు కొనియాడారు. రాష్ట్రంలో రాహుల్ గాంధీ అడుగుజాడల్లో వై ఎస్ షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం దిశగా అడుగులు వేస్తుందని వర్మ రాజు తెలిపారు. పార్టీని క్రియాశీలకంగా ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రతి నాయకుడు ముందుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేష్ త్రినాథ్, రాష్ట్ర స్పోర్ట్స్ సెల్ చైర్మన్ జీ వి వి కమలాకర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కాండవ గాయత్రి,జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఆనంద్ కుమార్, తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి, దక్షిణ నియోజకవర్గ ఇంచార్జ్ కే వి సూర్యనారాయణ, సేవాదళ్ జాతీయ కార్యదర్శి గంగాధర్, సీనియర్ నాయకులు కస్తూరి వెంకట్ రావు, చెన్న అప్పారావు, భోగవరపు శ్రీనివాస్, డా జీ పవన్ కుమార్,28 వార్డు అధ్యక్షుడు గుర్రం కనకారావు,పర్వీన్ ఖాన్,విన్సెంట్ కమలాకర్,డీసీసీ ఆఫీస్ ఇంచార్జ్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## విజయ దివస్–అంబేద్కర్‌కు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నివాళి

**వనపర్తి,డిసెంబర్ 9(ప్రజాస్వరం):**

తెలంగాణ విజయ దివస్ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వనపర్తి జిల్లా కేంద్రంలోగురువారం డా. బి ఆర్ అంబేద్కర్ కు వనపర్తి జిల్లా కేంద్రంలో పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ— “కె సి ఆర్ నవంబర్ 29 నుంచి డిసెంబర్ 9 వరకు చేసిన ఆమరణ దీక్షే తెలంగాణ ప్రకటనకు కారణం అయిందని దానివల్లనే డిసెంబర్ 9ను విజయ దానివల్లనే దివస్‌గా జరుపుకుంటాం” అని పేర్కొన్నారు. “ఘాటైన నిర్బంధాలు వచ్చినా కె సి ఆర్ వెనక్కు తగ్గలేదు దేశ పటంలో తెలంగాణను తిరిగి నిలబెట్టిన ఘనత ఆయనదే” అని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ— “ఆంధ్ర నాయకుల ప్రభావంలో తెలంగాణ కాంగ్రెస్ నడుస్తోంది. రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెడుతున్నారని” వ్యాఖ్యానించారు. “సుపరిపాలన కోసం మళ్లీ కెసిఆర్ ప్రభుత్వం రావాలి” అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



# డిసెంబర్ 13న పూర్వవిద్యార్థుల సంఘం వార్షిక సమావేశం

- **ముఖ్య అతిథిగా హాజరు కానున్న ఇన్ఫోసిస్ ఫౌండేషన్, మూర్తి ట్రస్ట్ చైర్ పర్సన్ సుధా మూర్తి**
- **వివరాలు వెల్లడించిన ఏఏఏ చైర్మన్**
- **పూర్వవిద్యార్థులను అనుసంధానం చేస్తాం**
- **ఏయూ వైస్ చాన్సలర్ ఆచార్య జి.పి రాజశేఖర్**

**ఆంధ్రవిశ్వవిద్యాలయం, డిసెంబర్ 9(ప్రజాస్వరం):**

ఆంధ్రవిశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థుల వార్షిక సమావేశం వేవ్స్ 2025 కార్యక్రమం డిసెంబర్ 13వ తేదీన నిర్వహిస్తున్నట్లు సంఘం చైర్మన్ కె.వి.వి రావు తెలిపారు. మంగళవారం ఏయూ ఆలుమ్ని జిఎంఆర్ సెమినార్ హాల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మహిళా సాధికారత థీంతో ఈ సంవత్సరం ఆలుమ్ని సమావేశం వేవ్స్2025 ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహిళా సాధికారతకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్న రాజ్యసభ సభ్యురాలు, రచయిత, ఇన్ఫోసిస్ ఫౌండేషన్, మూర్తి ట్రస్ట్ చైర్ పర్సన్ శ్రీమతి సుధా మూర్తి హాజరవుతున్నారన్నారు. విశ్వవిద్యాలయం వందేళ్ల వేడుకలను జరుపుకుంటున్న సమయంలో ఈ కార్యక్రమం మరింత ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఈ కార్యక్రమాలను చేపడతామన్నారు.కార్యక్రమంలో ఏయూ ఆలుమ్ని వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జి.ఎం రావు తదితరులు పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి 10 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ప్రధాన వేదికతతో పాటు ప్రాంగణం వెలుపల ప్రత్యేక స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ 13వ తేదీ మధ్యాహ్నం ఏయూ పరిపాలనా భవనం వద్దనున్న వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగా రెడ్డి విగ్రహానికి ముఖ్య అతిథి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారన్నారు. వార్షిక పూర్వవిద్యార్థుల సమావేశానికి వర్సిటీ పరంగా సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికంగా విద్యార్థినులు పాల్గొనాలని ఆహ్వానిస్తున్నామన్నారు. ఆలుమ్ని సదస్సు నిర్వహణకు సంపూర్ణ సహకారం అందించడం జరుగుతోందన్నారు. ఈ సందస్సులో ప్రపంచ వ్యాప్తంగా స్థిరపడిన ఏయూ పూర్వ విద్యార్థులను అనుసంధానించడం, విశ్వవిద్యాలయం అభివృద్ధిలో వారిని భాగస్వాములను చేస్తామన్నారు. విశ్వవిద్యాలయం భవిష్యత్ ప్రణాళికలను వారికి వివరించే ప్రయత్నం చేస్తామన్నారు. శతాబ్ధి ఉత్సవాలలో భాగంగా ఏయూ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రణాళికలను సిద్ధం చేసామని, వాటిలో పూర్వవిద్యార్థులను సైతం భాగస్వాములను చేస్తామన్నారు. డిసెంబర్ 13వ తేదీన ఉదయం ప్రతీ విభాగంలో పూర్వ విద్యార్థులతో ఆత్మీయ సమ్మేళనాలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థుల వార్షిక సమ్మేళనం వేవ్స్ 2025 కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్‌ను వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ ఆలుమ్ని చైర్మన్ కె.వి.వి రావుతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు డాక్టర్ కె.కుమార్ రాజ,జనరల్ సెక్రటరీ ఆకుల చంద్రశేఖర్,ఇసి సభ్యులు డాక్టర్ ఎస్.కె.ఇ అప్పారావు,ఆచార్య బి.మోహన వెంకట రామ్,వై.వి అనురాధ తదితరులు పాల్గొన్నారు.



## యస్.బి.ఐ.టి. లో ఘనంగా ప్రారంభమైన రెండు రోజుల హ్యాకథాన్

**ఖమ్మం,డిసెంబర్ 09(ప్రజాస్వరం):**

రేపటి సమస్యలకు నేడే పరిష్కారం కనుగొనడం హ్యాకథాన్ లక్ష్యం అని యస్.బి.ఐ.టి. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. మంగళవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన రెండు రోజుల అంతర్గత హ్యాకథాన్ కు ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో ఆరంభించారు. హాజరైన విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ ఆలోచనలను కోడ్ రూపంలోకి మార్చడంలో హ్యాకథాన్ ఉపయోగపడుతుందని తెలిపారు. మొదటి సంవత్సరంలోనే విద్యార్థులు ఐడియాథాన్, హ్యాకథాన్ వంటి పోటీలలో చురుకుగా పాల్గొనడం హర్షించదగ్గ విషయమని అభిప్రాయపడ్డారు. కళాశాలలోని ఇన్నోవేషన్ అండ్ ఇన్క్యూబేషన్ సెల్ ద్వారా లాంచ్ ప్యాడ్ 1.0 పేరుతో నిర్వహించిన హ్యాకథాన్లో 35 బృందాలు పాల్గొనగా, విజేతలకు రానున్న రోజులలో నిర్వహించబోయే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనే అవకాశాలను అందిస్తామని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి తెలిపారు. కళాశాల వైస్ చైర్మన్ కె. శ్రీచైతన్య మాట్లాడుతూ విద్యార్థులలోని ఆలోచనలకు పూర్తి రూపాన్ని అందించి, ఆచరణలోకి తీసుకురావడం హ్యాకథాన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులలోని సృజనాత్మకత ఆలోచింపజేసే రీతిగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. విద్యతో పాటు ఆధునిక సాంకేతిక రంగాలలో జరుగుతున్న మార్పులను అలవర్చుకొని ఇటువంటి వినూత్న పోటీల ద్వారా విద్యార్థులలో దాగి ఉన్న నూతన ఆవిష్కరణలను వెలికి తీయగలమని కళాశాల ప్రిన్సిపల్ డా॥ జి. రాజ్ కుమార్ తెలిపారు. అటానమస్, న్యాక్ ఏ+ హోదా తమ భాధ్యతను మరింతగా పెంచాయని, అందులో భాగంగానే ఈ విద్యా సంవత్సరంలో జిల్లా స్థాయి ఐడియాథాన్ నిర్వహించామని గుర్తు చేసారు. హ్యాకథాన్ రెండవ రోజున విజేతలను ప్రకటించి బహుమతులను అందజేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్నోవేషన్ అండ్ ఇన్క్యూబేషన్ సెల్ ఇంచార్జ్ డా॥ మురళీ మోహన్, పి. అశ్విని, అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాస రావు, డా॥ ఎ.వి.వి. శివ ప్రసాద్, విభాగాధిపతులు డా॥ అమిత్ బింధాజ్, డా॥ చరణ్ సింగ్, డా॥ సుప్రియ, డా॥ స్ఫూర్తి, డా॥ పద్మావతి, డా॥ పి. రామకృష్ణ, యస్. నాగమణి, డా॥ జి. ప్రభాకర్, టి.పి.ఒ. యస్. సవిత తదితరులు పాల్గొన్నారు.






**మొగిలి జలకంఠేశ్వర పార్వతి సమేత దేవరకొండకు 2 లక్షల రూపాయల విలువగల వెండి నాగ పడగలను బహుకరించిన తమిళనాడు వాసులు.**

**బంగారుపాళ్యం డిసెంబర్ 9(ప్రజాస్వరం):**

చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం మొగిలి దేవరకొండ నందు జలకంటేశ్వర పార్వతి సమేత దేవరకొండకు 2 లక్షల రూపాయల విలువగల వెండి నాగ పడగలను తమిళనాడుకు చెందిన తిరువల్లూరు రవి శాంతి దంపతులు బహుకరించారు. రవి శాంతి దంపతులకు పెళ్లయి 10 సంవత్సరాలకు పైగా సంతానం లేకపోవడంతో మొగిలి దేవరకొండ నందు మ్రొక్కుబడులు తీర్చుకున్న నేపథ్యంలో ప్రస్తుతం ఒక సంవత్సర క్రితం మగ బిడ్డకు జన్మనివ్వడం చాలా సంతోషంగా ఉందని ఇందుకు జలకంటేస్వరా పార్వతి సమేత వారికి ఎప్పటికీ రుణపడి ఉంటామని వారు పేర్కొన్నారు. వెండి ఒక కేజీ 36 గ్రాముల విలువ 1 లక్ష 80 వేల రూపాయలు, మాంగల్యం తో కలిపి 20వేల రూపాయల వరకు మొత్తం 2 లక్షల రూపాయలు పైగాతమ కుమారుడి పేరుపై బహుకరించడం చాలా సంతోషంగా ఉందని సోమవారం వారు తెలియజేశారు.కార్యక్రమంలో అఖిలభారత తెలుగు పురోహిత సేవ అధ్యక్షులు పురోహితులు పాణ్యం శ్రీనివాస శర్మ, మంజునాథ్ నాయుడు, ధనంజయ నాయుడు, ప్రసాద్ నాయుడు, మొగిలి వారి పల్లి భాస్కర్ నాయుడు, మొగిలిమిట్టూరు జీడి నాయుడు, ఆలయ అభివృద్ధి కమిటీ నాగరాజు దేవరకొండకు చెందినవారు పాల్గొన్నారు.

## వనపర్తి జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సిద్ధం అన్ని ఏర్పాట్లు పూర్తి.

- **జిల్లా కలెక్టర్ ఆదర్ష్ సురభి.**


**వనపర్తి,డిసెంబర్ 09 (ప్రజాస్వరం):**

జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అథారిటీ, కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదితో జిల్లా కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు, పోలింగ్ తరువాత తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు పొందినట్లు చెప్పారు. కలెక్టర్ వివరాలు తెలియజేస్తూ—జిల్లాలో మొదటి విడతగా 5 మండలాల్లోని 87 గ్రామ పంచాయతీలు, 780 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. వీటిలో 5 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, 104 వార్డు సభ్యులు ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, మిగిలిన 82 పంచాయతీల సర్పంచ్ పదవులు, 675 వార్డు మెంబర్ స్థానాలకు డిసెంబర్ 11న పోలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. డిసెంబర్ 9 సాయంత్రం 5 గంటలతో ప్రచారం ముగుస్తుందని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు వైన్ షాపులు మూసివేయనున్నట్లు తెలిపారు. ప్రిపోల్ ఏర్పాట్లు పూర్తయ్యాయని, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద పోలింగ్ సిబ్బందికి అవసరమైన బ్యాలెట్ బాక్సులు, మెటీరియల్‌ను రూట్ వారీగా పంపిణీ చేసే పనులు పూర్తయ్యాయని వివరించారు. పోలింగ్ నిర్వహణపై సిబ్బందికి పూర్తి స్థాయి శిక్షణ ఇచ్చామని చెప్పారు. మొత్తం 936 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 1189 మంది ఓ పి డి లు కలిపి 2125 మంది సిబ్బందిని మూడో ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించినట్లు వెల్లడించారు. బుధవారం ఉదయం 9 గంటలలోపు సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు హాజరై మెటీరియల్ తీసుకొని సాయంత్రం 5 గంటలలోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని ఆదేశించారు. డిసెంబర్ 11న ఉదయం 7 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజు లెక్కింపు పూర్తి చేసి ఫలితాలు ప్రకటించేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అదే రోజున ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించేందుకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో 144 సెక్షన్ అమల్లో ఉండడంతో పాటు, సమస్యాత్మక మరియు సున్నితమైన ప్రాంతాల్లో వెబ్‌కాస్టింగ్‌తో పర్యవేక్షణ చేపట్టనున్నట్లు చెప్పారు. 39 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని తెలిపారు. ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతాన్ని టి.పోల్ సిస్టంలో అప్‌డేట్ చేయనున్నట్లు చెప్పారు. ప్రతి కేంద్రంలో పోలీస్ బందోబస్తు కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ప్రచారం ముగిసిన గ్రామాల్లో ఇతర ప్రాంతాల వ్యక్తులను పంపేలా పోలీసులకు సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. ఎన్నికల పర్యవేక్షణ కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు యాదయ్య, ఖీమ్యా నాయక్, ఎన్నికల వ్యయ పరిశీలకులు శ్రీనివాసులు, డిపిఓ తరుణ్ చక్రవర్తి, డివిజనల్ పంచాయతీ అధికారి రఘుపతి రెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వరరావు, జిల్లా రవాణా అధికారి మానస, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## వనపర్తిలో ఘనంగా సోనియా పుట్టినరోజు వేడుకలు

**వనపర్తి,డిసెంబర్ 9 (ప్రజాస్వరం):**

తెలంగాణ తల్లి సోనియా గాంధీ పుట్టిన రోజును జిల్లా కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ— తెలంగాణ కోసం 1200 పైగా విద్యార్థులు ప్రాణత్యాగం చేసిన వేళ, వారి త్యాగాలను మనసులో పెట్టుకుని దేశ రాజకీయాలలో అరుదైన నిర్ణయం తీసుకున్నది సోనియా గాంధీగారేనని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి నష్టం జరిగే అవకాశం ఉన్నప్పటికీ, ప్రజల శ్రేయస్సే ముఖ్యం అన్న ధృఢసంకల్పంతో, రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం కొత్త రాష్ట్ర ఏర్పాటుకు ఆమె ముందడుగు వేసిన విషయాన్ని వివరించారు. తెలంగాణ సాధనలో ఆమె పోషించిన కీలక పాత్రను కొనియాడారు. అలాంటి మహనీయురాలి పుట్టినరోజును జరుపుకోవడం ప్రజల తరపున గర్వకారణమని నాయకులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, మాజీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్దన్, మైనార్టీ నాయకులు కమర్మియా, అక్తర్, మాజీ పట్టణ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరి రాములు యాదవ్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది ఎండి నిరంజన్ బాబా ,అంజిరెడ్డి, అనీష్,మన్యం యాదవ్, చీర్ల రాజేష్,జానంపేట నాగరాజు, మాజీ సర్పంచ్ సురేష్,రాంజీ నాయక్,నందిమల్ల రాములు, సందీప్,రోహిత్,ఇర్ఫాన్,లక్ష్మయ్య, నాగార్జున,ఆసిఫ్,చెన్నయ్య, సాయి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## నరేందర్ ను భారీ మెజారిటీతో గెలిపించాలి

**వలిగొండ,డిసెంబర్ 09(ప్రజాస్వరం):**

వలిగొండ మండలం గోపరాజు పల్లి లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని నీలం నరేందర్ భార్య మెజారిటీతో గెలిపించాలని మండల బీసీ సెల్ ప్రచార సహాయ కార్యదర్శి గాజులు అంజయ్య అన్నారు. పార్టీలో ఉన్న కార్యకర్తలు అభిమానులు సర్పంచ్ అభ్యర్థిని గెలిపించుకొని మన గ్రామానికి అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పార్టీల నాయకులు చేసే ప్రలోభాలకు లొంగకుండా సైనికులుగా పనిచేయాలన్నారు. వచ్చేది మన ప్రభుత్వమే అని కెసిఆర్ ఏ మళ్లీ ముఖ్యమంత్రి అయితాడని మళ్లీ మన సంక్షేమ పథకాలు వస్తాయని జనానికి చెప్పాలి అని అన్నారు. నీలం నరేంద్ర ఆశీస్సులు మన గ్రామానికి ప్రజలందరికీ ఉండాలని భారీ మెజారిటీ తో గెలిపించాలని తెలిపారు .టిఆర్ఎస్ పార్టీ భారీ మెజారిటీతో గెలవబోతుందని అన్నారు. చిన్న చిన్న .. సమస్యలు ఉంటే పక్కన పెట్టి కలిసికట్టుగా ఉండి ఓటేయాలి అన్నారు.గోపరాజు పల్లి లో ఎగిరేది గులాబీ జెండానే అని మరోసారి అంజయ్య అన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999